ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రికి అరుదైన పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న మహావీర్ సి. జైన్

హైదరాబాద్‌సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థకు అరుదైన పురస్కారం లభించింది. గుర్గావ్‌లోని హయాత్ రెజెన్సీలో జరిగిన ప్రతిష్ఠాత్మక గ్లోబల్ కార్పొరేట్ సోషల్ రెసాన్స్‌బులిటీ (సీఎస్ఆర్)-ఎన్విరాన్‌మెంటల్ సోషల్ అండ్ గవర్నమెంట్ (ఈఎస్జీ) అవార్డ్స్‌లో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యవిజ్ఞాన సంస్థ(ఎల్వీపీఈఐ)కు టాప్ 10 బెస్ట్ ఎన్జీవోస్ ఆఫ్ ది ఇయర్ 2024 పురస్కారం అందుకుంది. ఎల్వీపీఈఐ తరఫున పబ్లిక్ రిలేషన్స్, డోనర్ ఎఫైర్స్ బృందంలోని మహావీర్ సి.జైన్ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. అవార్డు సాధనలో సిబ్బంది అందరి అవిరాళ కృషి, అంకితభావం, దాతలు, భాగస్వాముల అచంచల మద్దతు ఉందని ఎల్వీపీఈఐ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు డాక్టర్ ప్రశాంత్ గర్గ్ పేర్కొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలు చేపట్టాలి

హైదరాబాద్ సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై ఆయన అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలపై విద్యాశాఖతోపాటు ఇతర శాఖల అధికారులు, పాఠశాలల ఉపాధ్యాయులు బస్తీల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఆగస్టు 15న ఆవిష్కరణల ప్రదర్శన ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆవిష్కరణ పేరు, ప్రదర్శనకు సంబంధించిన రెండు నిమిషాల వీడియో, ఆవిష్కరణలకు సంబంధించిన నాలుగు ఫొటోలు, 100 పదాలతో రాసి తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వాట్సప్ నంబర్: 9100678543కు ఆగస్టు 3వ తేదీ లోపు పంపాలని సూచించారు. అనంతరం కలెక్టర్, అధికారులు ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కదిరివన్, డీఈఓ రోహిణి, డీఎస్ఓ రమేష్, ఈ-డీఎం రజిత, డీపీఆర్ఓ ఎం.ఎ కలీం, ఇంటింటా ఇన్నోవేటర్ జిల్లా రిప్రెజెంటేటివ్ వినీత్ సిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉస్మానియా'లో ప్లాస్టిక్ సర్జరీ సేవలు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, జూలై8(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ రోజును పురస్కరించుకుని ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో ప్లాస్టిక్ సర్జరీ సేవలను సోమవారం ప్రారంభించినట్లు యూనిట్ చీఫ్, ప్రొఫెసర్ డాక్టర్ పలుకూరి లక్ష్మి తెలిపారు. ఈసేవలు 15వతేదీ వరకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. పెదవి చీలిక, అంగిలి చీలిక, చెవి లేకుండా పుట్టిన పిల్లలు, జోడించిన వేళ్లు, బొటనవేలు లేకపోవడం, కాలిన మచ్చలు, కాలిన వైకల్యాలు, పోస్ట్ ట్రామా మచ్చలు, బొల్లి పాచెస్, కుష్ఠు వ్యాధి సమస్యలు, చేతి, దవడ కణితులు, పెద్ద, చిన్న రొమ్ములు, తల, ముఖ వైకల్యాలకు చికిత్స అందిస్తారని చెప్పారు. ఆస్పత్రిలోని 202 నంబర్ గల ఓపీ గదిలో సోమవారం నుంచి శనివారం వరకు ప్లాస్టిక్ సర్జన్లు చేసే అన్ని రకల ఆపరేషన్లపై అవగాహన కల్పిస్తారని, తర్వాత శస్త్రచికిత్సలు చేస్తారని వివరించారు.

బైక్‌లను దొంగిలిస్తున్న ముఠా అరెస్టు


కేసు వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ అడిషనల్ డీసీపీ జయరాంరెడ్డి

రాయదుర్గం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్లు, హోటళ్ల ఎదుట పార్కు చేసిన ద్విచక్రవాహనాలను దొంగిలిస్తున్న ముఠాను గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 16 బైక్‌లను స్వాధీనం చేసుకున్నా రు. ఈ మేరకు సోమవారం గచ్చిబౌలి పీఎస్‌లో మాదాపూర్ అడిషనల్ డీసీపీ జయరాంరెడ్డి, ఏసీపీ శ్రీకాంత్, ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు కేసు వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దేవకిషోర్(20), కడియాల వీరవెంకట సత్యనారాయణ(21), ఏసుబాబు(17), సిద్దు(17), దిలీప్(19) బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చారు. స్విగ్గిఫుడ్ డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తుండటంతో వీరందరి మధ్య పరిచయం ఏర్పడింది. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో హాస్టళ్లు, కార్యాలయాలు, ఇళ్లు, హోటళ్ల ఎదుట పార్కు చేసిన బైక్‌లను లక్ష్యంగా చేసుకుని దొంగిలించేవారు. వీరిలో ఒకరికి ఓ షోరూంలో టెక్నీక్‌లాన్‌గా పనిచేసిన అనుభవం ఉండడంతో చోరీ చేసిన బైక్‌ల కీసెట్‌లను మార్చేవాడు. వాటిని తక్కువ ధరలకు విక్రయిస్తూ విలాసవంతమైన జీవితానికి అలవాటుపడ్డారు. అయితే, కొంతమంది వాటి పత్రాలు సరిగా లేకపోవడంతో కొనేందుకు నిరాకరించారు. దీంతో ఈ వాహనాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించాలని ప్లాన్ చేశారు. సోమవారం కొండాపూర్ బొటానికల్ గార్డెన్ వద్ద గచ్చిబౌలి పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన దొంగతనాలు వెలుగులోకి వచ్చాయి. వీరు వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగిలించిన 16 బైక్‌లను స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


మాట్లాడుతున్న తెలంగాణ మాల సంఘాల జేఏసీ చైర్మన్ రాంచందర్ తదితరులు

ఎస్సై మృతికి కారకులైన అధికారులను తొలగించాలి

● సీఐ, కానిస్టేబుళ్లపై ఎస్సీఎస్టీ అత్యాచార నిరోధక చట్టం పెట్టాలి

ఖైరతాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దళిత వర్గానికి చెందిన అశ్వారావుపేట ఎస్సై శ్రీనివాస్ మరణానికి కారకులైన సీఐతో పాటు సిబ్బందిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. సోమవారం ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్ అంబేద్కర్ స్ఫూర్తి భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి విలేకరులతో చెరకు రాంచందర్, ప్రతినిధులు మాట్లాడారు. ఆత్మహత్యకు ప్రేరేపించిన అధికారులు, ఉద్యోగులపై ఎస్సీఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో బలమైన సాక్ష్యాలను ప్రవేశపెట్టి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చేయాలని, సత్వర న్యాయం జరిపేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు కేసును అప్పగించాలన్నారు. మృతి చెందిన శ్రీనివాస్ కుటుంబ సభ్యుల్లో ఒకరికి గ్రూప్ వన్ ఉద్యోగం ఇవ్వాలని, ఆయన కుటుంబానికి రూ.రెండు కోట్ల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బెరా బాలకిషన్, మేక వెంకన్న, వైస్ చైర్మన్లు నర్మెట మల్లేష్, గంగాధర్, గడ్డం సత్యనారాయణ, చింతపల్లి కాశబూనాథ్, అచ్యుతయ్య, కృష్ణ, రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 5 కోట్ల విలువైన డ్రగ్స్ ధ్వంసం

● రాచకొండ కమిషనరేట్ పరిధిలో గత ఏడాది పట్టుబడ్డ డ్రగ్స్


బయోమెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో డ్రగ్స్‌ను ధ్వంసం చేస్తున్న డ్రగ్ డిస్పోజబుల్ కమిటీ అధికారులు

హైదరాబాద్ సిటీ: రాచకొండ కమిషనరేట్ పరిధిలో గత ఏడాది పలు కేసుల్లో పట్టుబడ్డ గంజాయితోపాటు పలురకాల డ్రగ్స్‌ను డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ధ్వంసం చేశారు. సీపీ తరుణ్ జోషి ఆదేశాల మేరకు డ్రగ్ డిస్పోజబుల్ కమిటీ చైర్మన్ ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, సభ్యులు అడ్మిన్ డీసీపీ పి.ఇందిర, మల్కాజిగిరి ఏసీపీ ఎస్.చక్రపాణి, సీసీఆర్బీ ఏసీపీ రమేష్ కుమార్‌ల ఆధ్వర్యంలో తుక్కాపూర్‌లోని బయోమెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో డ్రగ్స్‌ను ధ్వంసం చేశారు. కమిషనరేట్ పరిధిలో 23 పోలీస్‌స్టేషన్‌లలో ఏడాది వ్యవధిలో పట్టుబడ్డ 3,484 కిలోల గంజాయి. 402 కిలోల నల్లమందు పౌడర్, 14 గ్రాముల ఎండీఎంఏ, 3.50 కిలోల హష్ ఆయిల్, 45 గ్రాముల మెఫిడ్రిన్, 958 గ్రాముల చరస్, 100 గ్రాముల గంజాయి చాక్లెట్లు మొత్తం కలిపి రూ.5,03,31,783 విలువైన డ్రగ్స్‌ను సోమవారం అధికారులు ధ్వంసం చేశారు.

ఘనంగా వైఎస్ జయంతి వేడుకలు

ఎల్బీనగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని సోమవారం ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ల పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్ జనహృదయ నేత అని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని చిత్రా లేఅవుట్‌లోని వైఎస్ విగ్రహానికి పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంపాపేటలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్‌లోని కర్మన్‌ఘాట్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి పలువురు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.


మందమల్లమ్మ చౌరస్తాలో నివాళులు అర్పిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాతారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, అనితారెడ్డి

బడంగ్‌పేట్, మీర్‌పేటలలో..

సరూర్‌నగర్: మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. జిల్లెలగూడ మంద మల్లమ్మ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి పాల్గొని వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

అల్మాస్‌గూడలో

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ రాజీవ్‌గృహకల్ప చౌరస్తాలో వైఎస్ జయంతి వేడుకల్లో మేయర్ పారిజాతారెడ్డి పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.


చిత్రాలేఅవుట్‌లోని వైఎస్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, పీసీసీ ప్రతినిధి భాస్కర్‌రెడ్డి తదితరులు

బాలాపూర్ చౌరస్తాలో

బాలాపూర్ చౌరస్తాలో కాంగ్రెస్ ప్రచార కమిటీ సభ్యుడు సామిడి గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేలు కేఎల్లార్, తీగల కృష్ణారెడ్డి, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి పాల్గొని వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్థానికులకు పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు.

ఎస్టీపీ ప్లాంటు పనులు నాణ్యతతో చేపట్టాలి


ఎస్టీపీ ప్లాంటు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రోజుకు దాదాపు 320 ఎం.ఎల్.డీ మురుగు నీటిని శుద్ధి చేసేందుకు ఏర్పాటు చేస్తున్న ఎస్టీపీ ప్లాంటు పనులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన చేపట్టాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్ ఫతుల్లాగూడలో దేశంలోనే మొదటిసారిగా అత్యాధునిక ఎస్.బీ.ఆర్(సీక్వెన్సార్ బ్యాక్ రియాక్టర్)టెక్నాలజీ సాయంతో సుమారు రూ.450 కోట్ల నిధులతో చేపడుతున్న ఎస్.టీ.పీ పనులను సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్బీనగర్ అభివృద్ధి పంథాలో మరో కలుకితరాయి చేరబోతుందన్నారు. గతంలో మూసీ సుందరీకరణ పనుల్లో భాగంగా అప్పటి సీఎం కేసీఆర్ సహకారంతో తాను మూసీ రివర్ ఫ్రంట్ చైర్మన్‌గా నియామకం అయిన సందర్భంగా మూసీనది ప్రక్షాళనలో భాగంగా 2022 మార్చి 17న ఈ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ప్రస్తుతం ఈ పనులు చివరిదశకు చేరుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకుల అనంతుల రాజిరెడ్డి, చిరంజీవి, సతీష్, అధికారులు రాజ్‌కుమార్, రజనీకాంత్, రమేష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అనురాధ

హయత్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అన్నారు. వర్షాకాలాన్ని పురస్కరించుకుని సోమవారం రాగన్నగూడ వార్డు కార్యాలయంలో వైద్య సిబ్బంది, డాక్టర్లు, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ వర్షాకాలం వచ్చినందున గుంతల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నీరునిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ప్రజలు చెత్తను రోడ్లపైన వేయకుండా ఇంటికి వచ్చే ఆటోలకు వేయాలని కోరారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మున్సిపాలిటీలో అపరిశుభ్రత లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ హరిత, మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ జీఎం శ్రీధర్, డీజీఎం సునీల్, మేనేజర్ వినయ్, డాక్టర్ శ్రావణి, సూపర్ వైజర్ నర్సింహ, డీఈఈ సత్యనారాయణ, ఏఈఈ మల్లికార్జున్, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, కౌన్సిలర్లు కొశిక ఐలయ్య, మంగమ్మ, బాల్‌రాజ్, ధన్‌రాజ్, కవిత, ఉదయశ్రీ, మల్లేష్, అనురాధ పాల్గొన్నారు.


చింతలకుంట స్కూల్‌లో విద్యార్థులతో బెంచీలు మోయిస్తున్న ఉపాధ్యాయులు

చిన్నారులతో బెంచీలు మోయించిన ఉపాధ్యాయురాలు

సరూర్‌నగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని చింతలకుంటలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్కూల్ ఉపాధ్యాయురాలు చిన్నారులతో బెంచీలు మోయించడం వివాదాస్పదంగా మారింది. ఒక ప్రదేశంలో ఉన్న బెంచీలను విద్యార్థులు మోస్తూ తరగతి గదులకు తీసుకెళ్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. చదువుకోవడం కోసం తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపిస్తే.. అక్కడి ఉపాధ్యాయులు వారి చేత బెంచీలు మోయించడం ఎంత వరకు సమంజసమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల చేత పని చేయించిన ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.


పూరీలో వచ్చిన పురుగు

వామ్మో.. పూరీలో పురుగు

● హోటల్‌లో దారుణం

సైదాబాద్, జూలై 8(ఆంధ్రజ్యోతి): హోటల్‌లో పూరీ తిందామని వెళ్లిన కస్టమర్‌కు చేదు అనుభం ఎదురైంది. గడ్డిఅన్నారంలోని రాఘవేంద్ర టిఫిన్స్ అండ్ మిల్స్‌లో ఓ వ్యక్తి పూరీ ఆర్డర్ ఇచ్చాడు. పూరీ తింటుండగా అందులో పెద్ద సైజులో పురుగు వచ్చింది. దీంతో బిత్తరబోయిన కస్టమర్ హోటల్ సిబ్బందిని ప్రశ్నించాడు. ఏదో పొరపాటు జరిగింది.. మరోసారి రిపీట్ కాకుండా చూసుకుంటామని చెప్పకుండా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీంతో కస్టమర్‌కు ఏం చేయాలో పాలుపోక బిల్లు సైతం చెల్లించి అక్కడ నుంచి బయటకు వచ్చేశాడు. అందుకు సంబంధించిన వీడియో పోస్టుచేయడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

గుండె పోటుతో వ్యక్తి మృతి

హయత్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆస్తిలో వాటాకావాలని మొదటి భార్య కుమారుడు తండ్రిని నిలదీయడంతో గుండెపోటుతో మృతి చెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కుంట్లూర్‌లో నివాసం ఉండే తంగిరాల ఎల్లయ్య (45)కు ఇద్దరు భార్యలు మొదటి భార్య లక్ష్మీ, రెండో భార్య సబిత. ఎల్లయ్య కుంట్లూర్‌లో రెండో భార్య వద్ద నివాసం ఉంటున్నాడు. మొదటి భార్య మరో చోట ఉంటున్నది. కాగా సోమవారం మొదటి భార్య కుమారుడు నగేష్, ఆయన భార్య శ్రావణిలు కుంట్లూర్‌కు వచ్చి ఎల్లయ్యతో గొడవ పడ్డారు. కుంట్లూర్‌లో ఉన్న ఇంట్లో వాటా కావాలని వారు నిలదీశారు. గొడవ పడుతుండగానే ఎల్లయ్య ఒక్క సారిగా గుండెపోటుకు గురి అయ్యి కుప్పకూలి అక్కడే మృతిచెందాడు. రెండో భార్య సబిత పిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు సోమవారం సాయంత్రం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జల్సాలకు మరిగి.. చోరీల బాట ఎంచుకుని..

● తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురి అరెస్టు

● వారిలో ఒకడు బాల నేరస్థుడు

● రూ.12లక్షల సొత్తు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కాశిరెడ్డి

సరూర్‌నగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి, సులువుగా సొమ్ము సంపాదించడం కోసం ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను సోమవారం మీర్‌పేట్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.12లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకడు మైనర్(బాల నేరస్థుడు) కావడం గమనార్హం! దీనికి సంబంధించిన వివరాలను సోమవారం మీర్‌పేట్ పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్ నాగరాజుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి వెల్లడించారు. జనగామ జిల్లా, రఘునాథ్‌పల్లి మండలం బానాజీపేట్‌కు చెందిన వల్లెపు జితేందర్ అలియాస్ జిత్తు(20) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ మండలంలోని పీర్జాదిగూడలో నివసిస్తూ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మహబూబ్‌బాద్ జిల్లాలోని బీటీనగర్‌కు చెందిన రాపోల్ చందు అలియాస్ కృష్ణ(21) ఉప్పల్‌లో ఉంటూ సెంట్రింగ్ పని చేస్తున్నాడు. వరంగల్ జిల్లా గూడూరుకు చెందిన రాపోల్ శ్రీశైలం అలియాస్ చిన్నా(34) ఉప్పల్‌లోని బీరప్పగడ్డలో నివసిస్తూ లేబర్ పని చేస్తున్నాడు. వీరు ముగ్గురితో పాటు మరో బాల నేరస్థుడు కలిసి జట్టుగా ఏర్పడి రాత్రి వేళల్లో ఇళ్ల తాళాలు పగులగొట్టి సొత్తు చోరీ చేయడం ప్రవృత్తిగా పెట్టుకున్నారు. జిత్తు, కృష్ణ, బాల నేరస్థుడిపై వనస్థలిపురం, మీర్‌పేట్, మేడిపల్లి పీఎస్‌లలో పలు కేసులు నమోదై ఉన్నాయి. వారంతా పలుమార్లు జైలుకు సైతం వెళ్లి వచ్చారు. సదరు ముగ్గురు జైలు నుంచి(బాల నేరస్థుడు అబ్జర్వేషన్ హోమ్ నుంచి) బయటకు వచ్చిన తర్వాత రాపోల్ శ్రీశైలంను పరిచయం చేసుకుని మళ్లీ చోరీలు మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఇటీవల బడంగ్‌పేట్ మారుతీనగర్‌కు చెందిన రమేశ్ ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన మీర్‌పేట్ పోలీసులు సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు జరిపి నలుగురు నిందితులను సోమవారం హయత్‌నగర్ ప్రాంతంలో అరెస్టు చేశారు. వారి నుంచి 125 గ్రాముల బంగారు నగలు, 450 గ్రాముల వెండి వస్తువులు, ఒక ద్విచక్రవాహనం, ఒక ఇనుప రాడ్డును స్వాధీనం చేసుకున్నారు. ఈ సొత్తు విలువ రూ.12లక్షలు ఉంటుందని ఏసీపీ కాశీరెడ్డి చెప్పారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

దృష్టి మరల్చి బంగారం అపహరణ

● పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు

హయత్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తాము కంసాలి వారం.. మంగళసూత్రాన్ని అల్లి, కడిగి ఇస్తామని నమ్మించి ఓ మహిళ వద్ద నుంచి మూడు తులాల మంగళసూత్రాన్ని తీసుకుని దృష్టి మరల్చి అందులో నుంచి తులం బంగారాన్ని కాజేసిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మునగనూర్‌కు చెందిన ఓర్సు రేణుక గృహిణి. ఆదివారం ఉదయం 10గంటలకు గుర్తు తెలియని ఇద్దరు యువకులు బైకుపైన వచ్చారు. రేణుక ఇంటి వద్ద బైకును ఆపి తాము కంసాలివారం (గోల్డ్‌స్మిత్)అని చెప్పారు. తెగిపోతున్న మంగళసూత్రాన్ని అల్లి, శుభ్రంగా కడిగి ఇస్తామని నమ్మ బలికారు. దీంతో రేణుక తన మెడలో ఉన్న మూడు తులాల మంగళసూత్రాన్ని తీసి వారికి ఇచ్చింది. మంగళసూత్రాన్ని అల్లినారు. అనంతరం వారు తీసుకువచ్చిన నీటిలో కడిగారు. ఇంట్లో నుంచి కొంత పసుపు తీసుకురావాలని రేణుకను కోరడంతో ఆమె ఇంట్లోకి వెళ్లి పసుపు తీసుకుని వచ్చింది. తర్వాత వారు మంగళసూత్రాన్ని రేణుకకు ఇచ్చి వెళ్లారు. ఆ సమయంలో రేణుక అపస్మారకంగా ఉంది. దుండగులు వెళ్లిన తర్వాత చూస్తే మంగళసూత్రం సన్నగా కనిపించింది. అనుమానం వచ్చి సోమవారం తూకం వేయించగా మంగళసూత్రం రెండు తులాలు మాత్రమే ఉంది. కంసాలి పేరుతో వచ్చిన దుండగుల పనేనని గుర్తించి సోమవారం సాయంత్రం హయత్‌నగర్ పోలీసులకు రేణుక ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

చాదర్‌ఘాట్: గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని చాదర్‌ఘాట్ పోలీసులు సోమవారం గుర్తించారు. ఎస్ఐ శివాజీ తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట నల్గొండ చౌరస్తా సమీపంలో ఉన్న క్లాసిక్ ఐస్ క్రీమ్ ఎదుట మహిళ పడి ఉన్నట్లుగా స్థానికులు గుర్తించి చాదర్‌ఘాట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి ఆదివారమే మృతిచెందినట్లు గుర్తించారు. మృతురాలి వివరాలు తెలియకపోవడంతో గుర్తు తెలియని మహిళ మృతదేహంగా గుర్తించి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

అనుమతి లేని ఎక్సెల్సియా స్కూల్ సీజ్

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పసుమాములలో అనుమతి లేని ఎక్సెల్సియా స్కూల్‌ను సోమవారం మండల విద్యాశాఖ అధికారులు సీజ్ చేశారు. విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా లక్షల రూపాయల ఫీజులను వసూలు చేస్తున్నారని నాలుగు రోజుల క్రితం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో సదరు స్కూల్ వద్ద ఆందోళన నిర్వహించారు. దాంతో దిగివచ్చిన విద్యాశాఖ అధికారులు స్కూల్‌కు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో సీజ్ చేశారు.

మలక్‌పేటలో వన మహోత్సవం ప్రారంభం


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, జూలై 8(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలో సోమవారం వనమహోత్సవాన్ని ఎమ్మెల్యే అహ్మద్ బలాల మొక్కలు నాటి ప్రారంభించారు. నియోజకవర్గంలోని ఆజంపుర డివిజన్‌లో గల టర్బాన్ గ్రౌండ్‌లో ఆయన జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ అమీనా, ఎంఐఎం నాయకులు షేక్ మోహీయుద్దీన్ అబ్రార్‌తో కలిసి మొక్కలు నాటారు. వన మహోత్సవంలో భాగస్వాములై విధిగా ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటేందుకు ముందుకు రావాలని ఎమ్మెల్యే బలాల పిలుపునిచ్చారు.

బోనాలను ప్రశాంతంగా జరుపుకోవాలి: డీసీపీ


మాట్లాడుతున్న డీసీపీ కాంతిలాల్‌పాటిల్

సైదాబాద్: బోనాల వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతి లాల్‌పాటిల్ సూచించారు. సోమవారం సైదాబాద్ పోలీస్‌స్టేషన్ సమావేశం హాల్‌లో జోన్ పరిధిలోని శాంతి, మైత్రి సభ్యులతో కలిసి మొహర్రం, బోనాల వేడుకల ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాతబస్తీలో ఈనెల 28న బోనాల వేడుకలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. మొహర్రం, బోనాల ఉత్సవాల నేపథ్యంలో ముందు జాగ్రత్తగా భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ స్వామి, ఏసీపీలు వెంకన్ననాయక్, శ్యాంసుందర్, ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

కొత్తపేట: మారుతీనగర్, మోహన్‌నగర్‌ల డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మారుతీనగర్, మోహన్‌నగర్‌లలో పర్యటించారు. కొన్నాళ్లుగా మారుతీనగర్ రోడ్ నెం.63లో పాత డ్రైనేజీ పైప్‌లైన్లతో తరచూ మురుగు దారులపైకి చేరుతోందని ఆయనకు కాలనీ ప్రతినిధులు విన్నవించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి నూతన పైప్‌లైన్లు వేయాల్సి ఉందని సమస్యను పరిష్కరించడానికి జలమండలి అధికారులను సంప్రదించామని పేర్కొన్నారు.

రాఘవేంద్రనగర్‌కాలనీ అధ్యక్షుడిగా బాల్‌రాజ్


ఎమ్మెల్యే సబితతో రాఘవేంద్రనగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

సరూర్‌నగర్: మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ రాఘవేంద్ర నగర్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సిరూర్ బాల్‌రాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్, కోశాధికారిగా రాంప్రసాద్ ఎన్నికయ్యారు. వారితో పాటు ఇతర కార్యవర్గాన్ని సైతం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా నూతన కార్యవర్గం ప్రతినిధులు సోమవారం మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి కాలనీ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. 4వ డివిజన్ కార్పొరేటర్ సిద్దాల పద్మాఅంజయ్య, బీఆర్ఎస్ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

కనులపండువగా వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు

ఎల్బీనగర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలోని కుర్తాళ పీఠం ప్రత్యంగిరా పరమేశ్వరి ఆలయంలో వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. సోమవారం నాటి ప్రత్యేక పూజాధికాలలో ఎమ్మెల్సీ వాణీదేవి, చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ అమ్మవారి జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌కేపురం సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామారావు, వెంకటేశ్వర్లు, విఠల్‌శర్మ, సాయికుమార్‌శర్మ, అరుణ పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళి ఆలయ వార్షికోత్సవం

సైదాబాద్, జూలై 8(ఆంధ్రజ్యోతి): కుర్మగూడలో మహంకాళి ఆలయం(మూడు గుళ్లు) 18వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకురాలు శ్రీదేవి చండీహోమం నిర్వహించారు. మాదన్నపేట, కుర్మగూడ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సహదేవ్‌యాదవ్, సభ్యులు బర్ల శ్రవణ్‌కుమార్, సురేందర్, కిషన్, సూర్యకిరణ్, నర్సింహ, మహేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా రాంరెడ్డి

ఎల్బీనగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా మల్‌రెడ్డి రాంరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఎర్రమంజిల్‌లోని ఆర్‌అండ్‌బీ భవనంలో ఆయన కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన రాంరెడ్డిని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కీ, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామ్మోహన్‌గౌడ్‌లు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

స్కూల్‌లో పారిశుధ్యం నిర్వహణ అస్తవ్యస్తం

సైదాబాద్, జూలై 8(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ జయనగర్‌లోని సెయింట్ ఆంద్రూస్ స్కూల్‌లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంతో దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో విద్యార్థులు జ్వరాల బారినపడుతున్నారని చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం మండల ఉపవిద్యాశాఖాధికారి రాధాకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సమస్యపై రాష్ట్ర గవర్నర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సీఎం, విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తల్లిదండ్రులు అబ్దుల్ అజీజ్, మస్తాన్, మహేష్ తెలిపారు.

కన్యకాపరమేశ్వరీ ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

వనస్థలిపురం: బండ్లగూడ జాగీర్ గంధంగూడలో వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ నిర్మాణానికి రూ.1,11,000 ఆర్థిక సహాయాన్ని నాగోల్‌లోని తన నివాసంలో టీపీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆర్యవైశ్యులు అందరూ కలిసిమెలసి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అమ్మవారి ఆశీస్సులు మనందరిపై ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రావికంటి కిషన్, మెడ సత్యనారాయణ, సురేందర్, నరేష్, రాములు, లక్ష్మి, నారాయణ పాల్గొన్నారు.

నేడు జాతీయ విద్యార్థి దినోత్సవం : ఏబీవీపీ

హైదరాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం విద్యార్థి ఉద్యమం ప్రారంభమై 76సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ యూనివర్సిటీల విభాగం కన్వీనర్ జీవన్ తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ జెండా కోసం ప్రాణాలర్పించిన 48మంది అమరులకు జోహార్లు అర్పించనున్నట్లు వివరించారు. విద్యార్థుల కోసం నిరంతరం ఏబీవీపీ పనిచేస్తున్నదని పేర్కొన్నారు. 76 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఏబీవీపీకి 54,85,514 మంది సభ్యులు ఉన్నారని జీవన్ తెలిపారు.